క్లుప్తంగా

ఘనంగా ఆవేటి వారాలు



ముర్రాటలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

హిరమండలం: మండల కేంద్రంలోని దేవర శెట్టి, బ్రాహ్మణ, గాంధీనగర్ వీధుల్లో ఆవేటి వారాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు ముర్రాటలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలు చెవిటమ్మ, నీలమణిదుర్గ అమ్మవార్లకు చల్లదనం చేశారు. ఈ ఏడాది పంటలు సంవృద్ధిగా పండాలని మొక్కులు చెల్లించారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



రాజాన ఇంద్రజ



సవర పద్మశ్రీ

మెళియాపుట్టి: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన రాజాన ఇంద్రజ, కేజీబీవీ పాఠశాలకు చెందిన సవర పద్మశ్రీ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించారు. వీరికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు ఆదివారం అభినందనలు తెలిపారు.

చిలకమ్మ మృతికి సంతాపం



చిలకమ్మ (ఫైల్)

హిరమండలం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వంగపల్లి చిన్నారావు మాతృమూర్తి, వైస్ ఎంపీపీ సావిత్రి అత్త చిలకమ్మ (80) శనివారం రాత్రి చొర్లంగిలో ఇంటి వద్ద గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించారు. చిలకమ్మ మృతిపై పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, పార్టీ మండల కన్వీనర్ మీసాల వెంకటరామకృష్ణ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏవీ సురేష్, మాజీ జెడ్పీటీసీ లోలుగు లక్ష్మణరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు సంతాపం తెలిపారు.

పరామర్శ..



ఆఫీసరావును పరామర్శిస్తున్న మామిడి శ్రీకాంత్

కొత్తూరు: మండలంలోని నేరడి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యురాలు బోర కమలమ్మ అత్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆఫీసరావు తల్లి అమ్మన్నమ్మ ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ తూర్పుకాపు కుల రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్ ఆదివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకుడు బూర్లె శ్రీనివాసరావు, గొంటి రమేష్, తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జలుమూరు: జలుమూరు జూనియర్ కాలేజీలో బోటనీ లెక్చరర్ పోస్టుకు గెస్ట్ లెక్చరర్‌గా పని చేసేందుకు ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జామి సారిక ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ (బోటనీ)లో 50 శాతం మార్కులు ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీలో ఈ నెల 18వ తేదీన నిర్వహించనున్న ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు.

ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

ఆమదాలవలస: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బి.శ్యామ్‌సుందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీవీఈఓ ఆదేశాల మేరకు ఈ పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్టు వెల్లడించారు. వృత్తి విద్యా కోర్సుల్లో ఎం-ఏటీ (మెకానికల్), ఏ-టీ (అకౌంట్స్) గ్రూపుల్లో ఒక్కో పోస్టు చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. ఎం-ఏటీ పోస్టుకు బీటెక్ (మెకానికల్)లో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత, ఏ-టీ పోస్టుకు ఎం.కామ్‌లో 50 శాతం మార్కులు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. దరఖాస్తులు ఈ నెల 15వ తేదీలోగా కళాశాల పని వేళల్లో అందజేయాలన్నారు. ఈ నెల 18వ తేదీన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఇంటర్వ్యూ ఉంటుందన్నారు.

మానవతా విలువలు నేర్పించాలి

సారవకోట: బాల వికాశ్ కార్యక్రమం ద్వారా పిల్లలలో ఆధ్యాత్మికత పెంపొందించడం, మానవతా విలువలు నేర్పించాలని సత్య సాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు అన్నారు. మండల కేంద్రంలోని సత్యసాయి మందిరంలో పాతపట్నం జోనల్ కన్వీనర్ సైలాడ అన్నయ్య నాయుడు ఆధ్వర్యంలో జోనల్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ.. నవంబర్ 23న సత్య సాయి బాబా శత జయంతి ఉత్సవాలు భారీ స్థాయిలో నిర్వహిస్తామని, దీని కోసం ఇప్పటి నుంచే అన్ని గ్రామాల్లోనూ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా నుంచి 10 వేల మంది సత్యసాయి భక్తులు పుట్టపర్తి వెళ్లనున్నారన్నారు. 134 గ్రామాల్లో ఆధ్యాత్మికత పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.



లెక్కకు మించి విద్యార్థులను తీసుకువెళ్తున్న ఆటోలు

నిబంధనలు గాలికి!

- ప్రమాదం అంచున ప్రయాణం
- ఆటోల్లో లెక్కకు మించి విద్యార్థుల తరలింపు
- చిన్నారులు భద్రమేనా..

పాతపట్నం: వరుస ప్రమాదాలు జరుగుతున్నా ఆటోవాలలు తీరు మారడం లేదు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించి ప్రమాదాలకు కారణమవుతున్నారు. విద్యార్థులను సైతం కుక్కి పాఠశాలలకు తీసుకెళ్తున్నారు. ఆటోలు ఏ మాత్రం అదుపు తప్పినా విద్యార్థులకు ముప్పు తప్పదు. పాతపట్నం, కొత్తూరు, హిరమండలం, మెళియాపుట్టి, చాపర, ఎల్.ఎన్.పేట, గంగువాడ, సీది, తెంబూరు, తిడ్డిమి, సరాలి, పర్లాకిమిడి ప్రాంతాల్లో ఆటో ప్రయాణం ప్రమాదకరంగా మారుతోంది. బస్సు సౌకర్యం ఉన్నప్పటికీ చార్జీలు తక్కువ, గమ్యస్థానానికి వేగంగా వెళ్లాలని విద్యార్థులు, కార్మికులు ఆటోల్లో ప్రయాణం సాగిస్తున్నారు. వీరితోపాటు ఇక్కడ వ్యాపారం, విద్య, ఉద్యోగ నిమిత్తం వందల సంఖ్యలో ప్రజలు రోజూ ప్రయాణాలు సాగిస్తున్నారు. పని ముగించుకుని ఇంటికి వేగంగా వెళ్లాలన్న ఆలోచనతో ఆటో ప్రయాణం చేస్తున్నారు. ఇదే అదునుగా భావించి ఆటోవాలాలు క్యాష్ చేసుకుంటున్నారు. పాతపట్నంలో విద్యా సంస్థలు 15, మెళియాపుట్టిలో 6, హిరమండలంలో 5, కొత్తూరులో 8, ఎల్.ఎన్.పేటలో 4 వరకు ఉన్నారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం ఆటోల్లో ఆయా పాఠశాలలు, కళాశాలలకు వేల సంఖ్యలో విద్యార్థులు వస్తూ.. వెళ్తుంటారు.

నిబంధనలకు విరుద్ధంగా



ఆటోలో కిక్కిరిసి ఉన్న విద్యార్థులు

ఆటోలో నిబంధనల ప్రకారం నలుగురు నుంచి ఐదుగురు మాత్రమే ప్రయాణించాలి. ఆటోవాలాలు మాత్రం సుమారు 14 మందిని ఎక్కిస్తున్నారు. డ్రైవర్ సీట్లో ఇద్దరు, లోపల 8 మంది, వెనుక నలుగురుని కుక్కుతున్నారు. అదే విద్యార్థులయితే సుమారు 16 మందిని ఎక్కిస్తున్నారు. ఆటో స్టాండ్‌లో వరుస క్రమంలో పెట్టాలనే ఆలోచనతో అతివేగంగా నడుపుతున్నారు. ప్రయాణికులు కూడా గమ్యానికి త్వరగా చేరాలన్న ఉద్దేశంతో ప్రమాదకరమైన ప్రయాణానికి సిద్ధపడుతున్నారు.

పోలీసులు హెచ్చరించినా..

పరిమితమైన ప్రయాణికులతో ఆటోలు నడపాలని పోలీసులు నిత్యం డ్రైవర్లకు సూచిస్తున్నారు. అయినా వారి తీరుమారడం లేదు. పట్టణం దాటిన తర్వాత ప్రయాణికులు, విద్యార్థులను అధిక సంఖ్యలో ఎక్కించుకుని వారి పని వారు చేసుకుపోతున్నారు.

నిబంధనలు పాటించాల్సిందే



ఆటోల్లో పరిమితికి మించి చిన్నారులను ఎక్కించకూడదు. తప్పనిసరిగా సెక్యూరిటీ గ్రిల్స్ ఉండాలి. పరిమిత వేగంతో ఆటోలను నడపాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు. ఇటీవల పాతపట్నం పోలీసు స్టేషన్ పరిధిలో ఆటోలకు సురక్ష పేరుతో క్యూఆర్ కోడ్ కూడా కేటాయించామన్నారు.

– వి.రామారావు, సీఐ, పాతపట్నం

బదిలీ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి



మాట్లాడుతున్న పూజారి హరిప్రసన్న

పొందూరు: ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా బదిలీపై స్థానాలు మారిన వారికి తక్షణమే జీతాలు చెల్లించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పొందూరులో ఆదివారం ఉదయం అఫీషియల్ కాలనీలోని డీటీఎఫ్ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి గురుగుబెల్లి రాజశేఖర్‌తో కలిసి హరిప్రసన్న మాట్లాడారు. పాఠశాలల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా కొన్ని పాఠశాలలకు కొత్తగా హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, క్లస్టర్ ఉపాధ్యాయుల పోస్టులను సృష్టించి బదిలీలు చేశారు. నూతనంగా సృష్టించిన ఉపాధ్యాయ పోస్టుల్లో నియమించిన వారికి పొజిషన్ ఐడీ నంబర్లు ఇంతవరకు కేటాయించకపోవడంతో జీతాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత పాఠశాలల్లో హెచ్‌ఎంలతోపాటు మిగిలిన ఉపాధ్యాయులు కూడా రెండు నెలలుగా జీతాలు అందలేదన్నారు. రోజుకో కార్యక్రమం నిర్వహించి బోధనకు ఆటంకం కలగజేయడం సమంజసం కాదన్నారు. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే.. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఉపాధ్యాయులకు న్యాయబద్ధంగా రావాల్సిన డీఏ, పీఆర్సీ బకాయిలు చెల్లించాలన్నారు.

నేడు మండల సమావేశం

ఆమదాలవలస: ఈ నెల 14వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ రోణంకి వెంకటరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ తమ్మినేని శారదమ్మ అధ్యక్షతన ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొనాలని కోరారు.

విజయవంతం చేయండి

హిరమండలం: ఈ నెల 16వ తేదీన వైఎస్సార్‌సీపీ మండల స్థాయి సమావేశాన్ని ధనుపురం గ్రామంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్టీ మండల అధ్యక్షుడు మీసాల వెంకటరామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి హాజరవుతారన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

16 నుంచి వైఎస్సార్‌సీపీ సమావేశాలు

నరసన్నపేట: ఈ నెల 16వ తేదీ నుంచి బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ, రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోపై మండల స్థాయిలో వైఎస్సార్‌సీపీ సమావేశాలు నిర్వహిస్తున్నామని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య ఆదివారం తెలిపారు. 16న నరసన్నపేట మండలంలోని ఉర్లాంలో, 17న పోలాకి మండలంలోని ఈదులవలస కూడలిలో, 18న జలుమూరు మండలంలోని చల్లపేట కూడలిలో, 19న సారవకోట మండలంలోని అలుదు కూడలిలో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశాల్లో ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వృద్ధులకు తప్పని తిప్పలు!

- గ్రామాల్లో తీరని రేషన్ కష్టాలు
- సుదూర ప్రాంతాల నుంచి రేషన్ తీసుకువస్తున్న లబ్ధిదారులు
- కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న కార్డుదారులు

సారవకోట: కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో ప్రజలకు రేషన్ కష్టాలు మరలా మొదలైయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో ఎండీఎం వాహనాల ద్వారా రేషన్ సరుకులను గ్రామాలకు వెళ్లి అందజేశారు. కూటమి ప్రభుత్వం ఎండీఎం వాహనాలను తొలగించి పాత పద్ధతిలో రేషన్ డిపోలకు వెళ్లి రేషన్ సరుకులు తీసుకోవాల్సి వస్తోంది. సుదూర ప్రాంతాల్లో ఉన్న రేషన్ కార్డుదారులు ఆయా రేషన్ డిపోలకు వెళ్లి ప్రతినెలా వ్యయ, ప్రయాసలు పడావల్సి వస్తోంది.

నరసన్నపేట నియోజకవర్గంలో 201 రేషన్ డిపోలున్నాయి. వీటి పరిధిలో 79,003 రేషన్ కార్డుదారులున్నారు. 60 శాతానికి పైగా రేషన్ కార్డుదారులు ఆయా రేషన్ డిపోలకు సుమారు అర కిలో మీటరు నుంచి 3 కిలో మీటర్లు దూరంలో ఉన్న డిపోలకు వెళ్లి రేషన్ సరుకులు ప్రతి నెలా తీసుకుని రావాల్సి వస్తోంది. సారవకోట మండలంలోని పలు గిరిజన గ్రామాల ప్రజలు రేషన్ సరుకుల కోసం ఆయా డిపోలకు నడుచుకుంటూ వెళ్లి రేషన్ సరుకులు మోసుకుని రావాల్సి పరిస్థితి. వ్యయ, ప్రయాసలు పడలేక కొంత మంది రేషన్ సరుకులను తీసుకోవడం లేదు. మండంలోని మహాళింగి రేషన్ డిపోకు పనసలోవ, మొదిలికొత్తూరు గ్రామాలు 3 కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. కిడిమి డిపో భద్రాచలం గ్రామానికి 2 కిలో మీటర్లు, మాళువ రేషన్ డిపో సవర మాళువ, కాలనీ మాళువకు 2 కిలో మీటర్లు, గోవర్ధనపురం డిపోకు అర్లి గ్రామం 2.5 కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. మిగిలిన మండలాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి.



కిడిమి నుంచి భద్రాచలం గ్రామానికి రేషన్ సరుకులు మోసువెళ్తున్న కార్డుదారులు

ఆలస్యంగా రేషన్ పంపిణీ..

సారవకోట మండలంలోని కొత్తూరు రేషన్ డిపోలో ఈ నెల రేషన్ సరుకుల పంపిణీ ఈ నెల 11న ప్రారంభమైంది. డీలర్ల ద్వారా రేషన్ సరుకుల పంపిణీని కూటమి ప్రభుత్వ ప్రారంభించడంతో ఇక్కడి రేషన్ డీలర్ రాజీనామా చేశారు. వేరే డీలర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ డిపోకు సుమారు 1.5 కిలో మీటర్ల దూరంలో ఉన్న కోదడ్డపనస నుంచి లబ్ధిదారులు సరుకుల కోసం రావాల్సి వస్తోంది.

ఇంటింటికీ అందని రేషన్..

వృద్ధులు రేషన్ డిపోలకు వెళ్లి సరుకులు తీసుకువెళ్ల లేరనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ప్రతీ నెలాఖరున వచ్చే నెల రేషన్ సరుకులు వారి ఇంటికి తీసుకెళ్లి ఇవ్వాలని సూచించింది. నియోజకవర్గంలో ఏ మండలంలోనూ ఈ విధానం అమలు చేసే దాఖలాలు కన్పించడం లేదు. కొన్ని రేషన్ డిపోల పరిధిలో సరుకులు పంపిణీ చేసేందుకు కనీసం లాగిన్ అయ్యే దాఖలాలు కూడా లేవు. సారవకోట మండలంలోని మహాళింగి రేషన్ డిపో దీనికి ఉదాహరణ. బుడితి గ్రామంలోని రెండు రేషన్ డిపోల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నరసన్నపేట నియోజకవర్గంలో రేషన్ కార్డుల వివరాలు..

మండలం	రేషన్ డిపోలు	రేషన్ కార్డులు	వృద్ధాప్య రేషన్ కార్డుదారులు
జలుమూరు	53	18,817	1,505
నరసన్నపేట	53	23,134	1,848
పోలాకి	50	20,886	1,672
సారవకోట	45	16,166	1,293



బుడితి రేషన్ డిపో నుంచి సరుకులు తీసుకెళ్తున్న వృద్ధుడు


ఆదేశాలిస్తున్నాం..



ప్రభుత్వం సూచనల మేరకు వృద్ధులకు వచ్చే నెల సరుకులు ఈ నెలాఖరులో వారింటికి తీసుకెళ్లి అందించాలని సూచించాం. ఆదేశాలు పటిష్టంగా అమలు చేసేందుకు అన్ని చర్యలూ తీసుకుంటాం. ప్రతీ ఒక్క డీలర్ ఈ విధానం అమలు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– విజయలక్ష్మి, తహసీల్దార్, సారవకోట

ఇబ్బంది పడుతున్నారు..



రేషన్ సరుకులు తీసుకెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రేషన్ సరుకులు ఆ డిపో పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు వెళ్లి సరఫరా చేయడం జరిగింది. ఇప్పుడు ఆ విధానం లేకపోవడంతో చాలా గ్రామాల ప్రజలు కిలో మీటర్లు దూరం నడుచుకుంటూ వెళ్లి సరుకులు మోసుకుని వెళ్లాల్సి వస్తుంది.

– నక్క తులసీదాస్, డీఎల్‌డీఏ చైర్మన్, బుడితి, సారవకోట మండలం

బెర్మ్‌లు వేసేదెప్పుడు?



ఈ చిత్రం నరసన్నపేట మండలంలోని డోలపేట సమీపంలో బెర్మ్‌లు లేని రోడ్డు. మండలంలోని ఉప్పరిపేట నుంచి అంబోజీపేట వరకు సుమారు ఆరు నెలల క్రితం రోడ్డు నిర్మాణం చేశారు. రోడ్డుకు ఇరు వైపులా బెర్మ్‌లు ఇంతవరకూ వేయకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు కూడా శిథిలమయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీరాజ్ ఇంజినీర్లు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఉప్పరిపేటకు వేసిన తారు రోడ్డుకు కూడా బెర్మ్‌లు పటిష్టం చేయాలన్నారు.

– నరసన్నపేట

రోడ్డుపైనే మురుగునీరు..



ఈ చిత్రం కొత్తూరు మండలంలోని పాలకొండ–హడ్డుబంగి రోడ్డులో గల నివగాం గ్రామం పట్నాల వీధి వద్ద దుస్థితి. నిత్యం రద్దీగా ఉన్న ఈ రోడ్డు గోతులమయమైంది. రోడ్డుకు ఇరువైపులా కాలువలు లేకపోవడంతో మురుగునీరు, వర్షం నీరు రోడ్డు పైనుంచి ప్రవహిస్తోంది. ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించి రోడ్డును బాగుచేయాలని, కాలువలను నిర్మించాలని ప్రయాణికులు, పట్నాల వీధి వాసులు కోరుతున్నారు.

– కొత్తూరు

గోతులమయం..



ఈ చిత్రం పాతపట్నం మండలంలోని తెంబూరు–బడ్డుమర్రి రహదారి. మారుమూల గిరిజన గ్రామాలైన శిష్టుజగన్నాథపురం, రాజన్నపేట, బడ్డుమర్రి, టి.కొత్తూరుకు వెళ్లే రహదారి గోతులతో బురదమయమైంది. తెంబూరు రైల్వే స్టేషన్ నుంచి బడ్డుమర్రి మీదుగా వెళ్లే ఈ మార్గం కొద్దిపాటి వర్షానికే పూర్తిగా అధ్వానంగా తయారైంది. కనీసం నడవడానికి కూడా వీల్లేని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి రహదారిని బాగు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

– పాతపట్నం

శిథిలావస్థలో..



ఈ చిత్రం బూర్జ మండలం లాభాం గ్రామంలో శిథిలావస్థలో ఉన్న పంచాయతీ భవనం. సుమారు 30 ఏళ్ల కిందట నిర్మాణం చేపట్టారు. శిథిలావస్థలో ఉన్న ఈ భవనాన్ని కూల్చివేసి, మరో భవనం నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– బూర్జ

బీసీ మహిళపై దాడి సరికాదు



మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

హిరమండలం: వైఎస్సార్‌సీపీ సమావేశానికి హాజరయ్యేందుకు వెళ్తున్న బీసీ మహిళ, కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హారికపై దాడి పిరికిపంద చర్య అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోలీసుల సమక్షంలోనే తమను ఎవరూ అడ్డుకోలేరన్న ధైర్యంతో టీడీపీ, జనసేన గూండాలు చేసిన ఈ దాడి రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగానికి నిదర్శనమన్నారు. టీడీపీ, జనసేన గూండాల దూషణ పర్వం, దాడి చేయడం సభ్యసమాజం తలదించుకునే సంఘటన అని అన్నారు. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

సోషల్ మీడియాను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న ధర్మాన కృష్ణచైతన్య

నరసన్నపేట: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియాను మరింత బలోపేతం చేయాలని, కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. నరసన్నపేటలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ సోషల్ మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ.. ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా నిలబడాలన్నారు. ప్రజల కష్టాలు, కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను బయటపెట్టాలన్నారు. సాక్షి చానల్ ప్రసారాలను కూటమి ప్రభుత్వం అడ్డుకుందని, చేతిలో ఉన్న ఫోన్‌నే అస్త్రంగా చేసి కూటమి ప్రభుత్వంతో ధైర్యంగా యుద్ధం చేయాలన్నారు. నియోజకవర్గంలో ఉన్న ప్రతి సోషల్ మీడియా కార్యకర్తకూ భవిష్యత్‌లో తగిన ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జి బోర నర్సునాయుడు, ఎంపీపీ ఆరంగి మురళి, నియోజకవర్గ సోషల్ మీడియా అనుబంధ విభాగ అధ్యక్షుడు పి.వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతు రాఘవరావు, బగ్గు రమణయ్య, నరసన్నపేట, జలుమూరు, సారవకోట, పోలాకి మండలాల సోషల్ మీడియా కార్యకర్తలు పాల్గొన్నారు.